పదునెట్టాంబడికి వేళాయే

రేపటి నుంచి అయ్యప్ప ఆలయ బ్రహ్మోత్సవాలు



మెట్లు ఎక్కుతున్న అయ్యప్ప భక్తులు(ఫైల్)

మహేశ్వరం: 'స్వామి శరణం.. అయ్యప్ప శరణం' అంటూ అయ్యప్ప మాలధారణ భక్తులు తలపై ఇరుముడి కట్టుకొని కేరళలోని శబరిమలై ఆలయంలో పదునెట్టాంబడి (18 మెట్లు ఎక్కుతూ) సందర్భంగా శరణుఘోష చేస్తుంటారు. శబరీమల మాదిరిగానే బాలాపూర్ మండల పరిధి మామిడిపల్లి బాల మణికంఠ అయ్యప్పస్వామి దేవస్థానంలో భక్తులకు పదునెట్టాంబడి అవకాశం ఉంది. ఆలయ బ్రహ్మోత్సవాలలో భాగంగా ఏటా మండల మహా పడిపూజ సందర్భంగా భక్తులకు ఇక్కడి ఆలయంలో పదునెట్టాంబడి అవకాశం కల్పించారు. దీంతో భక్తులు తరలివస్తుంటారు. ఈ నెల 26న జరుగనున్న మహా పడిపూజకు మాలధారులు భారీగా రానున్నారు. అయ్యప్ప సన్నిధిలో విఘ్నేశ్వరుడు, లక్ష్మీదేవి, సుబ్రహ్మణ్య స్వామి కొలువుదీరాడు. ఇక ఆలయ దిగువన రాహుకేతువు ఉన్నాడు.



అయ్యప్ప స్వామి దేవాలయం

2015లో విగ్రహ ప్రతిష్ఠాపన

మామిడిపల్లి గ్రామాన్ని ఆనుకొని పంట పొలాల్లో 2006లో శంకుస్థాపన చేసిన అయ్యప్ప స్వామి ఆలయాన్ని 2015లో పూర్తి చేశారు. అనంతరం విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. తొలి ఏడాది నుంచే ఇక్కడ పెద్ద సంఖ్యలో మాలధారణ చేసి, పూజలు నిర్వహిస్తున్నారు. ఆలయ ధర్మకర్త మద్ది జగదీశ్వర్ రెడ్డి పర్యవేక్షణలో సీజన్‌లో ఘనంగా పడిపూజ నిర్వహిస్తుంటారు. మాలధారణ చేసి శబరీమలైకి వెళ్లలేని వారి ఇరుముడిలు ఇక్కడ తీస్తున్నారు.

స్వామి దర్శనం వరం



అయ్యప్పస్వామి దర్శనం మాకు వరం. ఈ సారి ఇక్కడ 100 మందికి పైగా భక్తులు మాలధారణ చేశారు. 32 ఏళ్లుగా స్వామి వారి సేవలో ఉన్నా. 24న గణపతి హోమం, ధ్వజారోహణం నిర్వహిస్తాం. 25న లక్ష పుష్పార్చన, స్వామి వారి ఊరేగింపు, 26న అయ్యప్ప మహా పడిపూజ మహోత్సవం నిర్వహించనున్నాం. కేరళ ఆలయ సహాయ అర్చకుడు ఉన్నికృష్ణన్ నంబూద్రీ పర్యవేక్షణలో కార్యక్రమాలు కొనసాగుతాయి.

– జగదీశ్వర్ రెడ్డి, గురుస్వామి, ఆలయ ధర్మకర్త

లెనిన్‌నగర్‌లో రోడ్డు నిర్మించాలి

మీర్‌పేట: మీర్‌పేట కార్పొరేషన్ పరిధి లెనిన్‌నగర్‌లో కొత్తగా రోడ్డు వేయాలని బీజేపీ స్థానిక నాయకుడు చెవ్వ శ్రవణ్ ఆదివారం మహేశ్వరం ఎమ్మెల్యే సబితారెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, లెనిన్‌నగర్ ప్రాంతంలో ఆరు వార్డులకు కలిపి ఒకే ప్రధాన రహదారి కావడంతో.. వాహనాల రాకపోకలు ఎక్కువగా ఉంటాయని తెలిపారు. చాలాకాలంగా ఎలాంటి మరమ్మతులు చేపట్టని కారణంగా రోడ్డుపై గుంతలు ఏర్పడి వాహనదారులకు ఇబ్బందిగా మారిందని పేర్కొన్నారు. ఇదే విషయాన్ని గతంలో అధికారుల దృష్టికి తీసుకెళ్లామని, అయినా ఎవరూ స్పందించలేదని ఆరోపించారు. ప్రజల అవసరాలు, రవాణా సౌకర్యాన్ని దృష్టిలో ఉంచుకొని రహదారిని నూతనంగా నిర్మించాలని కోరారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో పార్టీ నాయకులు మధు తదితరులు ఉన్నారు.



ఎమ్మెల్యే సబితారెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న బీజేపీ నాయకులు



బాలాజీ ఆలయ సన్నిధిలో విద్యార్థులు, ఉపాధ్యాయులు

బాలాజీ ఆలయంలో విద్యార్థుల పూజలు

మహేశ్వరం: సీఎం రేవంత్‌రెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్న కొడంగల్ నియోజకవర్గం కుదురుమల్ల జెడ్పీహెచ్‌ఎస్‌కు చెందిన విద్యార్థులు విజ్ఞాన విహార యాత్రలో భాగంగా ఆదివారం మామిడిపల్లి బాలాజీ వేంకటేశ్వరస్వామిని దర్శించుకున్నారు. అనంతరం బాలబాలికలు ఆలయ ఆవరణలోని చెట్ల కింద సహపంక్తి భోజనాలు చేశారు. అంతకు ముందు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సాయప్ప పర్యవేక్షణలో 94 మంది విద్యార్థులు శంషాబాద్ ఏయిర్‌పోర్ట్‌ను సందర్శించారు. ఉపాధ్యాయులు వేణుగోపాల్, శ్రీనివాస్, తిరుపతి, సిబ్బంది మొఘలప్ప, నరేశ్, సిబ్బంది పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఘనంగా సెమీ క్రిస్మస్ వేడుకలు



నాటకంలో పాల్గొన్న చిన్నారులు

బడంగ్‌పేట్: కార్పొరేషన్ పరిధిలోని 29వ డివిజన్ సబితాఇంద్రారెడ్డి కాలనీలో గల కమ్యూనిటీ చర్చిలో ఆదివారం సెమీ క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. చిన్నారులు క్రీస్తు జననంపై నాటకం నిర్వహించి అందరినీ ఆకట్టుకున్నారు. చిన్నారులు డ్యాన్సులు, పాటలతో అలరించారు. పాస్టర్ రూపాస్ పాల్గొని క్రీస్తు జననం సందేశాన్ని వినిపించారు. ఏసుక్రీస్తు శాంతికి మార్గంగా నిలిచాడన్నారు. కార్యక్రమంలో పాస్టర్స్ రాందాస్, ఒనేసిఫర్, బాలె డానియల్, కుమార్ చందు, దేవిడ్, కిరణ్, బబ్లు, ప్రశాంత్, జోయల్, ప్రణయ్ తదితరులు ఉన్నారు.

ఆకట్టుకున్న విజ్ఞాన ప్రదర్శన

వనస్థలిపురం: వనస్థలిపురంలోని బచ్‌పన్, అకడమిక్ హైట్స్ పబ్లిక్ స్కూల్లో రెండ్రోజులుగా కొనసాగుతున్న విజ్ఞాన ప్రదర్శన అలరించింది. ప్రదర్శనకు ముఖ్య అతిథిగా హాజరైన రీజినల్ డైరెక్టర్ శ్రీకాంత్‌రెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థుల్లోని సృజనాత్మకతను వెలికి తీసేందుకు విజ్ఞాన ప్రదర్శనలు దోహదపడుతాయన్నారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు, సర్టిఫికెట్లు అందజేశారు. కోఆర్డినేటర్ సునీత శ్రీనివాస్, ప్రిన్సిపల్ కల్పవల్లి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

దేశం గర్వించదగిన మేధావి రామానుజన్

ఎంఈఓ మనోహర్



రామానుజన్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న గణిత ఫోరం ఉపాధ్యాయులు

షాద్‌నగర్: దేశం గర్వించదగిన మేధావి రామానుజన్ అని ఎంఈఓ మనోహర్ అన్నారు. గణిత మేధావి శ్రీనివాస రామానుజన్ జయంతిని ఆదివారం షాద్‌నగర్ పట్టణంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తెలంగాణ గణిత ఫోరం షాద్‌నగర్ డివిజన్ వారి ఆధ్వర్యంలో పట్టణంలోని ఎంఈఓ కార్యాలయ ఆవరణలో రామానుజన్ విగ్రహానికి గణిత ఫోరం ఉపాధ్యాయులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎంఈఓ మాట్లాడుతూ.. విద్యార్థులు గణితంలో మంచి పట్టు సాధించాలని సూచించారు. రామానుజన్ స్ఫూర్తితో నేటి విద్యార్థులు అపూర్వమైన విజయాలు సాధించాలన్నారు. కార్యక్రమంలో గణిత ఫోరం ఉపాధ్యాయులు నర్సింలు, పాండు రంగయ్య, గణేశ్‌కుమార్, మల్లేశ్, బాబుచంద్, ప్రకాశ్, సురేందర్‌రెడ్డి, నర్సింలు, శైలజ తదితరులు పాల్గొన్నారు.

ఏకాగ్రతతో చదివితేనే విజయం

ఎస్సీ హాస్టల్ వార్డెన్ శంకరయ్య

షాబాద్: విద్యార్థులు ఏకాగ్రతతో చదివితే ఉన్నతస్థాయికి ఎదుగుతారని ఎస్సీ హాస్టల్ వార్డెన్ పి.శంకరయ్య పేర్కొన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని ఎస్సీ హాస్టల్‌లో చదువుతున్న 106 మంది విద్యార్థులకు షెట్టర్లు పంపిణీ చేశారు. అదేవిధంగా 10వ తరగతి చదువుతున్న 21 మంది విద్యార్థులకు ఆల్ ఇన్ వన్ పుస్తకాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు ఏకాగ్రతతో చదివి ఉన్నతస్థాయికి ఎదగాలని చెప్పారు. విద్యార్థులు విద్యతోనే ఉన్నత స్థాయికి చేరుకుంటారని, చదువుతో ఏదైనా సాధించవచ్చన్నారు. ఇతరులకు సహాయం చేసే గుణాన్ని అలవాటు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో విద్యార్థులు, హాస్టల్ సిబ్బంది నర్సింలు ఉన్నారు.

ఆలయాల అభివృద్ధికి విరాళం



విరాళం అందజేస్తున్న దాతలు

షాద్‌నగర్‌రూరల్: మున్సిపాలిటీ పరిధిలోని జానంపేట గుండుకేరిలో గల హనుమాన్, శివాలయాల పునర్నిర్మాణానికి ఆదివారం ఫరూఖ్‌నగర్‌కు చెందిన యువ నాయకులు శీలం శ్రీను, శీలం శ్రీకాంత్ రూ.77,777ల విరాళాన్ని ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఆధ్యాత్మిక చింతనతోనే మానసిక ప్రశాంతత లభిస్తుందన్నారు. దైవ కార్యక్రమాల్లో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని సూచించారు. అనంతరం దాతలను ఆలయ కమిటీ సభ్యులు ఘనంగా సన్మానించారు. యాదయ్య, అశోక్, నర్సింలు ఉన్నారు.

డ్రైనేజీ నిర్మాణ పనులు ప్రారంభం



డ్రైనేజీ పనులను ప్రారంభిస్తున్న మేయర్ పారిజాత

బడంగ్‌పేట్: కార్పొరేషన్‌లోని 28వ డివిజన్ మారుతీనగర్ కాలనీలో ఆదివారం అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మేయర్ చిగురింత పారిజాత హాజరై స్థానిక కార్పొరేటర్ సూర్లగంటి అర్జున్‌తో కలిసి డ్రైనేజీ నిర్మాణ పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ.. అన్ని డివిజన్‌లలో కాలనీవాసులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తున్నానని చెప్పారు. ఆయా కాలనీల్లో మౌలిక సదుపాయాల కల్పనపై ప్రత్యేక దృష్టి సారించామని వెల్లడించారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ ఇబ్రాం శేఖర్, కార్పొరేటర్ సుదర్శన్‌రెడ్డి, నాయకులు రాళ్లగూడం శ్రీనివాస్‌రెడ్డి, గట్టు బాలకృష్ణ, బొల్లపల్లి కుమార్, నయనాచారి, నరేశ్, వెంకటేశ్, ప్రదీప్, కాలనీవాసులు, మహిళలు పాల్గొన్నారు.

ప్రతి కాలనీలో వసతుల కల్పనకు కృషి



పనులకు శంకుస్థాపన చేస్తున్న లచ్చిరెడ్డి

ఎల్‌బీనగర్: డివిజన్ పరిధిలోని ప్రతి కాలనీలో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తానని బీఎన్‌రెడ్డి నగర్ డివిజన్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి అన్నారు.ఎన్‌జీఓఎస్ కాలనీలో రూ.78 లక్షలతో చేపట్టనున్న సీసీ రోడ్ల పనులకు ఆదివారం ఆయన కాలనీవాసులతో శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా లచ్చిరెడ్డి మాట్లాడుతూ.. కాలనీలలో సమస్యలను తన దృష్టికి తీసుకు రావాలని వెంటనే పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు.ఈ కార్యక్రమంలో శ్రీనివాస్‌రెడ్డి, విష్ణువర్ధన్ రావు, వెంకటేశ్వర్లు, సోమయాజులు, శ్యాంకుమార్, ఆనంద్ పాల్గొన్నారు.

వైభవం.. బోనాల ఉత్సవం



బోనాల ఊరేగింపులో పోతురాజుల విన్యాసాలు

చేవెళ్ల: మండలంలోని దేవుని ఎర్రవల్లి గ్రామంలో ఆదివారం మైసమ్మ, ఎల్లమ్మ బోనాల ఉత్సవాలను వైభవంగా నిర్వహించారు. గ్రామ ప్రజలందరూ గ్రామ దేవతలకు బోనాలను సమర్పించి మొక్కలు తీర్చుకున్నారు. ఉదయం నుంచి రాత్రివరకు ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. పోతురాజుల విన్యాసాలు, శివసత్తుల పూనకాలు, డప్పుచప్పుళ్లు, యువకుల కేరింతల మధ్య బోనాల ఊరేగింపు కనుల పండువగా సాగింది. అనంతరం మహిళలు బోనాలతో ఆలయాలకు చేరుకొని అమ్మవార్లకు నైవేద్యం సమర్పించి, అందరినీ చల్లగా చూడు తల్లీ అంటూ వేడుకున్నారు. ఉత్సవాలకు గ్రామపెద్దలు అన్ని ఏర్పాట్లు చేశారు. ఈ వేడుకల్లో గ్రామస్తులు, ప్రజలు పాల్గొన్నారు.

ప్రజాసంక్షేమమే బీజేపీ ధ్యేయం

బీజేవైఎం స్వచ్ఛభారత్ సెల్ రాష్ట్ర కన్వీనర్ రాము

షాబాద్: ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ప్రధాని మోదీ పథకాలను ప్రవేశపెడుతూ అమలు చేస్తున్నారని బీజేవైఎం స్వచ్ఛభారత్ సెల్ రాష్ట్ర కన్వీనర్ రాము పేర్కొన్నారు. ఆదివారం మండల పరిధిలోని సర్దార్‌నగర్ గ్రామంలో రాము ఆధ్వర్యంలో 212వ బూత్‌కు పల్లాటి నరేశ్ కుమార్, 213వ బూత్‌కు రాజును అధ్యక్షులుగా ఎన్నుకొని నియామకపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్రం చేపడుతున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించాలని సూచించారు. పార్టీ బలోపేతమే లక్ష్యంగా అందరూ పనిచేయాలని సూచించారు. రాబోయే స్థానిక ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ గెలుపే లక్ష్యంగా పనిచేయాలన్నారు. కార్యక్రమంలో బీజేవైఎం మండల అధ్యక్షుడు దాదె మహేశ్, జిల్లా కార్యవర్గ సభ్యుడు విష్ణు, కిసాన్ మోర్చా జిల్లా నాయకులు నవీన్, మహేశ్‌కుమార్, నాయకులు యాదయ్య, నరేశ్, శ్రీను, చెన్నయ్య, రాజేశ్, ప్రశాంత్, సాయి, రఘు, అజయ్ తదితరులు ఉన్నారు.



బూత్ అధ్యక్షులకు నియామకపత్రాలు అందజేస్తున్న నాయకులు

రైతు బజారులో కూరగాయల ధరలు

వనస్థలిపురం: సరూర్‌నగర్, వనస్థలిపురం రైతుబజార్‌లలో కూరగాయల ధరల వివరాలు.. టమాట రూ. 15, వంకాయ రూ. 35, బెండ రూ. 45, పచ్చిమిర్చి రూ. 33, కాకర రూ. 35, బీర రూ. 55, క్యాబేజి రూ. 18, ఫ్రెంచిబీన్స్ రూ. 50, క్యారట్ రూ. 28, దొండ రూ. 45, చిక్కుడు రూ. 45, గోకర రూ. 28, బీట్‌రూట్ రూ. 43, క్యాప్సికం రూ. 50, ఆలు రూ. 25, దోస రూ. 15, సొరకాయ రూ. 13, పొట్లకాయ రూ. 18, ఉల్లిగడ్డ రూ. 35, చామగడ్డ రూ. 37. ఈ ధరలు సోమవారం ఉదయం 9 గంటల వరకు మాత్రమే అమలులో ఉంటాయి.

నాణ్యమైన భోజనం అందించాలి

మొయినాబాద్: గురుకుల పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని ఎస్ఎఫ్ఐ మండల అధ్యక్షుడు చరణ్‌గౌడ్ అన్నారు. ఆదివారం మండల పరిధిలోని చిలుకూరు, పెద్దమంగళారం, మొయినాబాద్‌లో గల సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలను ఎస్ఎఫ్ఐ నాయకులు సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గురుకుల పాఠశాలల్లో విద్యార్థులకు సరైన భోజనం పెట్టకపోవడంతో అస్వస్థతకు గురువుతున్నారన్నారు. ఫుడ్ పాయిజన్‌తో ఇప్పటికే కొందరు విద్యార్థులు మరణించారన్నారు. ఈ విషయంపై ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం పెట్టకపోతే ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో పెద్దఎత్తున ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు చందు, సాయిగౌడ్, ప్రదీప్, రాహుల్, విష్ణుగుప్తా తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం



రోగులను పరీక్షిస్తున్న వైద్యులు

కందుకూరు: తుక్కుగూడ కొండేటి ఆస్పత్రి ఆధ్వర్యంలో ఆదివారం కందుకూరులో ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వైద్యులు డాక్టర్లు సౌమ్య, ప్రమోద్‌కుమార్‌లు పలువురికి వైద్య పరీక్షలు నిర్వహించి, మందులు పంపిణీ చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ, తమ ఆస్పత్రిలో ప్రతి శుక్రవారం గర్భిణులు, మహిళలతో పాటు, బీపీ, షుగర్, థైరాయిడ్ సమస్యలతో బాధపడుతున్న వారికి ప్రతి సోమవారం ఉచితంగా ఓపీ సేవలు అందిస్తున్నామని తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.కార్యక్రమంలో ఆస్పత్రి మేనేజింగ్ డైరెక్టర్ కొండేటి మల్లయ్య, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు బొక్క జంగారెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు జయేందర్ ముదిరాజ్, ఎంపీటీసీ మాజీ సభ్యుడు ఎస్.రాజశేఖర్‌రెడ్డి, ఎస్.పాండు, నాయకుడు ఎస్.జైపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

నిత్యావసర వస్తువుల అందజేత

కేశంపేట: మండల పరిధిలోని బోధునంపల్లి గ్రామంలో దయ్యాల సునీత ఇంట్లో విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో ఇంట్లో వస్తువులతో పాటు నిత్యావసర వస్తువులు ధ్వంసమయ్యాయి. సునితది నిరుపేద కుటుంబం కావడంతో గ్రామానికి చెందిన పిప్పళ్ల శేఖర్ నిత్యావసర వస్తువులను ఆదివారం అందించారు. కార్యక్రమంలో నీల పాండు, బాలకృష్ణ, బాల్‌రాజు, వెంకటయ్య, అంజయ్య, బాలకృష్ణ, పెంటయ్య, హరేందర్, లక్ష్మయ్య, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో అయ్యప్ప పడిపూజ



కందుకూరు: పడిపూజలో ఎమ్మెల్యే సబితారెడ్డి తదితరులు

కందుకూరు: మండల కేంద్రంలోని టంకరి రాంరెడ్డి ఫంక్షన్‌హాల్‌లో ఆదివారం అయ్యప్ప మహాపడి పూజ, ఇరుముడి పూజా కార్యక్రమాన్ని స్వాములు వైభవంగా నిర్వహించారు. గురుస్వాములు రామకృష్ణ, జంగాచారి, శివ, శివప్రసాద్, శ్రీను, ఆనంద్, వినోద్, కార్తీక్, వెంకటేశ్‌గౌడ్ ఆధ్వర్యంలో 26 మంది స్వాములు ఇరుముళ్లతో శబరిమల యాత్రకు తరలి వెళ్లారు. కాగా అంతకుముందు గురుస్వాములు వెంకటేశ్‌గుప్తా, ముకుందం, రాముశర్మ సమక్షంలో పడిపూజ, ఇరుముడిపూజ జరిపించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే సబితారెడ్డి, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు బొక్క జంగారెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఎస్.సురేందర్‌రెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు జయేందర్‌ముదిరాజ్, పీఏసీఎస్ చైర్మన్ డి.చంద్రశేఖర్, మాజీ సర్పంచ్ అనురాధ, పాండుగౌడ్, పొట్టి ఆనంద్, దామోదర్‌గౌడ్, ప్రకాశ్‌రెడ్డి తదితరులు పూజల్లో పాల్గొన్నారు.



హుడాకాంప్లెక్స్: భిక్షలో పాల్గొన్న స్వాములు

మైసమ్మ దేవాలయంలో..

హుడాకాంప్లెక్స్: సరూర్‌నగర్‌లోని శ్రీ బంగారు మైసమ్మ దేవాలయంలో అయ్యప్ప మహాపడిపూజ వైభవంగా నిర్వహించారు. నరేశ్ గురుస్వామి బృందం శబరిమల యాత్రకు వెళ్తున్న సందర్భంగా ఆ స్వాముల ఇరుముళ్ల పూజ జరిపించారు. పూజ అనంతరం భక్తులకు అన్న ప్రసాద వితరణ చేశారు. కార్యక్రమంలో గురుస్వామి రాజు, ఆలయ చైర్మన్ ఆకుల అరవింద్‌కుమార్, ట్రస్ట్ మెంబర్ బేర బాల కిషన్ తదితరులు పాల్గొన్నారు.

ఆత్మరక్షణకు యుద్ధవిద్యలు అవసరం

బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు అశోక్‌గౌడ్

షాద్‌నగర్‌రూరల్: ఆపద సమయంలో మనల్ని మనం రక్షించుకునేందుకు యుద్ధవిద్యలు ఎంతో అవసరమని బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు మద్దూరి అశోక్‌గౌడ్ అన్నారు. పట్టణంలోని గ్రీన్‌పార్కు ఫంక్షన్‌హాలులో ఆదివారం సౌత్ ఇండియన్ కరాటే కుంగ్ తైక్వాండో రతన్ టాటా మెమోరియల్ ఛాంపియన్‌షిప్ టోర్నమెంట్ ముగింపు వేడుకలను నిర్వహించారు. ఈ ముగింపు వేడుకలకు ముఖ్య అతిథిగా అశోక్‌గౌడ్ హాజరై మాట్లాడుతూ.. ఆత్మరక్షణకు యుద్ధ విద్యలు ఎంతో అవసరమన్నారు. యుద్ధ విద్యలు దేహదారుఢ్యాన్ని పెంపొందించడంతో పాటు శారీరక, మానసికోల్లాసాన్ని కలిగిస్తాయన్నారు. ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా యుద్ధ విద్యలపై ఆసక్తి పెంపొందించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో నిర్వాహకులు బాల్‌రాజ్, దేవేందర్, స్వాతిరెడ్డి పాల్గొన్నారు.



కొందుర్గు: విజేతలతో నిర్వాహకులు

పోటీల్లో కొందుర్గు విద్యార్థుల ప్రతిభ

కొందుర్గు: షాద్‌నగర్ గ్రీన్ పార్క్ ఫంక్షన్ హాలులో ఆదివారం నిర్వహించిన రతన్ టాటా మెమోరియల్ టోర్నమెంట్‌లో కొందుర్గు న్యూమాంక్స్ కుంగ్‌ఫూ విద్యార్థులు పాల్గొని ప్రతిభ చూపినట్లు మాస్టర్ రమేశ్ తెలిపారు. ఈ పోటీల్లో కటాస్ విభాగంలో వేదాంశ ప్రథమ స్థానం సాధించగా వైష్ణవి, మేఘన ద్వితీయ స్థానంలో నిలిచారని, మైతిలి తృతీయ స్థానం సాధించినట్లు ఆయన పేర్కొన్నారు. ప్రతిభ చూపిన విద్యార్థులకు నిర్వాహకులు శివకోటి, నరేశ్, బాలరాజు ప్రశంస పత్రం, మెమోంటోలు బహూకరించారు.

కేంద్ర పథకాలపై ప్రచారం చేయాలి



బూత్ కమిటీ అధ్యక్షుడికి నియామకపత్రం అందజేస్తున్న వెంకటేశ్‌గుప్తా

బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి వెంకటేశ్‌గుప్తా

షాద్‌నగర్: కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలపై పార్టీ నాయకులు, కార్యకర్తలు ఇంటింటి ప్రచారం చేయాలని బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి కక్కునూరి వెంకటేశ్‌గుప్తా అన్నారు. ఆదివారం ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని రంగంపల్లి గ్రామంలో పార్టీ బూత్ కమిటీని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి పథకాలను అర్హులైన లబ్ధిదారులకు అందించేందుకు పార్టీ నాయకులు తగిన విధంగా కృషి చేయాలన్నారు. ప్రధాని మోదీ నిరుపేదల సంక్షేమం, దేశాభివృద్ధే ధ్యేయంగా ముందుకు సాగుతున్నారన్నారు. గ్రామ స్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేయాలని సూచించారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ వారు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి పరిష్కరించేందుకు తగిన కృషి చేయాలన్నారు. తద్వారా క్షేత్రస్థాయిలో పార్టీ బలపడుతుందన్నారు. ఈ సందర్భంగా బూత్ కమిటీ అధ్యక్షుడిగా జవాజీ శివకుమార్, సెక్రటరీగా సందుల రామకృష్ణను ఎన్నుకున్నారు. అనంతరం నూతన కమిటీ సభ్యులకు నియామకపత్రం అందజేశారు. కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి పిట్టల సురేశ్, కార్యకర్తలు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.